www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 జులై 2023

జవాబుదారీ తనంతో పనిచేయాలి

ప్రజాశక్తి - కడప

మాట్లాడుతున్న సురేష్‌రెడ్డి

మెప్మా సిబ్బంది జవాబుదారీతనంతో పనిచేయాలని కడప, అన్నమయ్య జిల్లాల మెప్మా పథక సంచాలకులు సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప శ్రీ విశ్వేశ్వరయ్య భవన్‌లో మెప్మా సిబ్బందితో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మెప్మా, పభుత్వ పథకాలు సక్రమంగా అమలు కావాలంటే మెప్మా సిబ్బంది క్రమశిక్షణతో, పారదర్శకంగా జవాబుదారీతనంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ పి. శివ ప్రసాద్‌రెడ్డి, వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలోని సిఎంఎంలు, సిఒలు, డిఇలు పాల్గొన్నారు.

మైలవరానికి మరమ్మతులేవీ?

రూ.80 కోట్లతో ప్రతిపాదనలు
ఏడాదిగా కోల్డ్ స్టోరేజీలోనే
టెక్నికల్ విభాగం మోకాలడ్డు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మరమ్మతుకు నోచని మైలవరం డ్యామ్ (ఫైల్ ఫొటో)

జిల్లాలోని భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో మైలవరం ఒకటి. ఇటువంటి ప్రాధాన్యత ప్రాజెక్టు రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాల ధాటికి మరమ్మతులకు గురైంది. రాయలసీమకే తలమానికమైన గండికోట రిజర్వాయర్‌కు అనుసంధానమై ఉంది. 9.99 టిఎంసిల నిల్వ సామర్థ్యం. 74 వేల ఎకరాల ఆయకట్టును కలిగి ఉంది. రిజర్వాయర్ మరమ్మతులకు నిరీక్షణ తప్పడం లేదు. గతేడాది ఆగస్టులో జిల్లా నీటిపారుదల శాఖ రూ.80 కోట్లతో ప్రతిపాదనలు అందజేసింది. రాష్ట్ర ఇరిగేషన్ ఇంజినీరింగ్ విభాగం రిమార్క్స్ పేరిట వెనక్కి పంపించింది. జిల్లా నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం రిమార్క్స్‌ను సవరించి మళ్లీ ప్రతిపాదనల్ని పంపించింది. అయినప్పటికీ సుమారు ఏడాదిగా పాలనామోదానికి నిరీక్షించాల్సి వస్తోంది. పాలనా మోదం అనంతరం సాంకేతిక అనుమతులు, టెండర్లు, అగ్రిమెంట్ల వ్యవహారం పూర్తి చేసే సమయానికి పుణ్యకాలం ముగుస్తుంది.

మైలవరానికి మరమ్మతులివే!

మైలవరం రిజర్వాయర్‌కు రివిట్‌మెంట్ దగ్గర నుంచి గెస్ట్‌హౌస్, గోడలు, గేట్లు, కట్ట, లెఫ్ట్ బ్లాంక్, ప్రొటెక్షన్‌వాల్, ఫ్లడ్‌గేట్, లైటినింగ్, రహదారి, గేట్లు, ఉత్తర, దక్షిణ కాల్వలు మొదలగు నిర్మాణ పనులు దెబ్బతిని శిథిలావస్థకు చేరువలో ఉన్నాయి. గతేడాది లెఫ్ట్ కెనాల్‌లో పెరిగిన కంప చెట్లు, ఈదర మొక్కలను తొలగించారు. మళ్లీ యథాతథ పరిస్థితులు నెల కొనడంతో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ స్పందించి జిల్లా నీటి పారుదలశాఖ సహకారంతో రూ.80 కోట్లతో ప్రతిపాదనలను అందజేశారు.

ఏడాదిగా తప్పని నిరీక్షణ

ఏడాదిగా అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ అనుమతుల కోసం జిల్లా నీటిపారుదల శాఖ నిరీక్షిస్తోంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ యంత్రాంగం రిమార్క్స్ పేరిట అనుమతులు ఇవ్వడంలో కాలయాపన చేస్తోంది. ముఖ్యమంత్రి జిల్లాకు చెందిన బారీ ప్రాజెక్టు పరిస్థితి ఇలా ఉంటే మిగిలిన మధ్య తరహా, చిన్న తరహా ప్రాజెక్టుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవాల్సిందే. రాబోయే నెల నుంచి వర్షాకాలం సీజన్ మొదలు కానుంది. సహజంగా ఆగస్టు, అక్టోబర్, నవంబర్ మాసాల్లో వరదలు పోటెత్తితే మైలవరం ప్రాజెక్టు పరిస్థితేమిటో తెలియడం లేదు. ఇప్పటికైనా రాష్ట్ర నీటిపారుదల శాఖ స్పందించి మైలవరం సాగునీటి ప్రాజెక్టు మరమ్మతుల పనుల్ని వేగవంతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహంలేదు. దీనిపై బాధ్యత ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను సంప్రదించగా ప్రతిపాదనలు ఆమోదం లభించిన వెంటనే పనులు చేపడతామని పేర్కొనడం గమనార్హం.

బినామీ పట్టాలు రద్దు చేసి పేదలకు న్యాయం చేయాలి

- భూ పోరాట కమిటీ జిల్లా అధ్యక్షులు బి.నారాయణ

ప్రజాశక్తి-కాశినాయన

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న బి.నారాయణ

మండలంలోని ఓబులాపురం, సర్వే నంబర్ -1లో బద్వేలు పట్టణానికి చెందిన రామకృష్ణ అనే భూకబ్జాదారుడికి ఇచ్చిన బినామీ పట్టాలు రద్దు చేసి స్థానికులైన పేదలు న్యాయం చేయాలని జిల్లా భూ పోరాట కమిటీ అధ్యక్షులు బి.నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన తహశీల్దార్ రామచంద్రుడిని కలిసి భూకబ్జాలపై వివరించారు. ఈ సందర్భంగా బి. నారాయణ మాట్లాడుతూ ఓబులాపురం సర్వే నంబర్-1లో దాదాపు 73 ఎకరాల పొలం ఉందని, స్థానికేతరుడైన రామకృష్ణ అనే వ్యక్తి 30 ఎకరాలు బినామీ పట్టాలు పొందారని చెప్పారు. స్థానికుడైన రిటైర్డ్ ఆర్మీ ప్రసాద్ అనే వ్యక్తి ఐదెకరాలు పట్టా చేయించుకుని అన్ని ఆధారాలతో భూమి వద్దకు వెళ్తే కబ్జాదారురుడైన రామకృష్ణ ఆర్‌డిఒకు, రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి ఇబ్బంది పడెతున్నారని తెలిపారు. అసైన్‌మెంట్ కమిటీ లేకుండా, సబ్ డివిజన్ కాకుండా 30 ఎకరాలకు ఆయన కంచె ఎలా వేస్తాడని ప్రశ్నించారు. పేదలు ఎవరైనా భూములు సాగు చేసుకుంటే వెంటనే రెవెన్యూ అధికారులు అడ్డుకుంటారని, కబ్జాదారుడు 30 ఎకరాల్లో కంచె వేస్తే చూస్తూ ఊరుకుని ఉండడం సమంజసం కాదని వాపోయారు. రెవెన్యూ అధికారులు త్వరలో పేదలకు న్యాయం చేయకపోతే వ్యవసాయ కార్మిక సంఘం, జిల్లా భూపోరాట కమిటీ ఆధ్వర్యంలో అక్కడి పేదలకు తామే న్యాయం చేయాల్సి వస్తుందని, దీనంతటికీ రెవెన్యూ అధికారుల బాధ్యత వహించాలని ఆయన తెలిపారు. రామకృష్ణ అనే భూకబ్జా దారునికి ఆర్మీ పట్టాలు 30 ఎకరాలకు ఎలా వచ్చాయని, కలెక్టర్ ఉత్తర్వులు ఉన్నాయా, అసలు కమిటీలో పాస్ అయ్యాయనే విషయాలు తహశీల్దార్ క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. ఒకే కుటుంబంలో 30 ఎకరాలు ఒకే చోట భూమి ఎలా ఇస్తారని ఇక్కడ పట్టగల వారికీ పోరు మామిళ్ల మండలంలోనూ భూమి ఉన్నట్లు తెలిసిందని ఆయన తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా కలసపాడు మండలం పిడుగుపల్లె గ్రామానికి చెందిన రాజారెడ్డి అనే వ్యక్తి అదే సర్వే నెంబర్లు 20 ఎకరాలు పట్టాలు కలిగి ఉన్నారని దీనిపైనా విచారించాలన్నారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో బిఎస్‌పి బిఎస్సి జిల్లా ప్రధాన కార్యదర్శి సగిలి గురప్ప జర్నలిస్టు అసోసియేషన్ సీనియర్ నాయకులు సి.ఆంజనేయులు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్, జిల్లా సహాయ కార్యదర్శి గురవయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజేంద్ర పాల్గొన్నారు.

సాయి సూర్యతేజరెడ్డి డబుల్ సెంచరీ

ప్రజాశక్తి - కడప

సూర్యతేజరెడ్డి

రాజ్‌దీప్

కర్నూలు జట్టు కెప్టెన్ ఏ. సాయి సూర్యతేజారెడ్డి డబుల్ సెంచరీ (218 పరుగులు) చేయడంతో రెండవ ఇన్నింగ్స్‌లో 388 పరుగులు చేసింది. 4 వికెట్ల నష్టానికి 148 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కర్నూలు జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 110.4 ఓవర్లలో 388 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టు కెప్టెన్ సాయి సూర్య తేజ రెడ్డి బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 274 బంతులను ఎదుర్కొని 28 బౌండరీలు, 6 సిక్సర్ల సహాయంతో 218 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని లోకిత్ సాయి కిషోర్ 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 14.0 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 93 పరుగులు చేసింది. ఆ జట్టు కెప్టెన్ పి.అర్జున్ టెండూల్కర్ 39 బంతులను ఎదుర్కొని 58 పరుగులు చేశాడు. మ్యాచ్ డ్రాగ ముగిసింది. **132 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు విజయం:** కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన వేరొక మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై 132 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 341 పరుగులు చేసింది. నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 252 పరుగులు చేసింది. రెండవ ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసి చిత్తూరు జట్టు డిక్లేర్ ప్రకటించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు రెండవ ఇన్నింగ్స్ లో 40.5 ఓవర్లలో 163 పరుగులకు ఆలౌట్ అయి ఓటమి చెందింది.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కాశినాయన : బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ నాయకుడు రితిష్ రెడ్డి పేర్కొన్నారు శుక్రవారం మండల కేంద్రమైన నర్సాపురంలో రాముల వారి కల్యాణ మండపంలో టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు సమావేశానికి ముఖ్య నేతలు తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు శ్వేతా రెడ్డి, కర్నాటి.వెంకట్ రెడ్డి హాజరు కాకపోవడంలో అంతర్యం ఏమిటి అని పలువురు మండలంలో చర్చించుకుంటున్నారు. వైసిపి అధికారంలో ఉన్నా ఇటీవల నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలలో తన సొంత ఎంపిటిసిని టిడిపి ఏకగ్రీవం చేసుకున్నారు సర్పంచ్‌తో సహా 12 వార్డులు కూడా టిడిపి క్లీన్‌స్వీప్ చేసుకున్నవారు. అలాంటి పట్టు ఉన్న నాయకులు సమావేశానికి హాజరు కాకపోవడం అంతర్యం ఏమేమిటో అని పలువురు మండల కేంద్రంలో చర్చించుకుంటున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, నాయకులు పాల్గొన్నారు

మార్పు కోసం ప్రజాసింహ గర్జన

పోస్టర్ ఆవిష్కరిస్తున్న శివయాదవ్

కడప అర్బన్ : ప్రజా సింహ గర్జన బహిరంగ సభ జయప్రదం చేయాలని అఖిల భారతీయ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు శివ యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మహాసభ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 23న గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ప్రజా చైతన్య వేదిక ప్రాంగణంలో నిర్వహించే ప్రజా సింహగర్జన బహిరంగ సభకు జిల్లా నుంచి వేలాదిమంది తరలి రావాలని పిలుపునిచ్చారు రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల మీద కపట ప్రేమ నటిస్తూ ఉన్నారని విమర్శించారు. ప్రజా ప్రతినిధులుగా అవకాశం కల్పించడం లేదని చెప్పారు. ప్రత్యామ్నాయంగా బిసిల ఆత్మగౌరవం కోసం బోడె రామచంద్ర యాదవ్ ఇవాళ పార్టీ పెట్టడానికి ముందుకు రావడంతో రాష్ట్రంలోని 80 శాతం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కోప్పల శివ యాదవ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరగనబోయిన శ్రీనివాస్ యాదవ్, సిటీ అధ్యక్షులు ఆవుల రవికుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు బిల్లా రమణ యాదవ్, జిల్లా కార్యదర్శి నూకనబోయిన శివ యాదవ్, సిటీ కార్యదర్శి గోపాల్ యాదవ్, శీను యాదవ్, వెంకటసుబ్బయ్య యాదవ్ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ జెవికె కిట్టు

ప్రజాశక్తి-కడప ప్రతినిధి

జెవికె కిట్‌ను అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాల యాజమాన్యంలో చదివే ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా కానుక కిట్లు అందిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చింతకొమ్మదిన్నె మండలం ప్రకాశంపల్లిలో ఉన్న ఆశా ఫౌండేషన్ బధిరులపాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి వుండేలా వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ బధిరులు అన్ని రంగాల్లో రాణించాలని, విభిన్న ప్రతిభావంతుల కోటాలో ప్రభుత్వ శాఖలలో అనేక ఉద్యోగాలు వారికి అందుబాటులో ఉన్నాయని గుర్తు చేశారు ప్రయివేట్ రంగాల్లో సైతం అనేక అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. క్రీడల్లో సైతం ప్రత్యేక అవకాశాలు కల్పిస్తూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా కానుక కిట్లు అందించడంలో భాగంగా బధిరుల పిల్లలు కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయించాలని పేర్కొన్నారు. పాఠశాల సిస్టర్ జ్యోతిష్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ఆడిటర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

గిరిజా శంకర్‌ను కలిసిన రాష్ట్ర అధ్యక్షులు పి.షరీఫ్ ఖాన్

వ్యాపారులు, జిఎస్‌టి, ఆడిటర్ల ఆడిటర్స్ సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.షరీఫ్ ఖాన్ కోరారు. శుక్రవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ జిఎస్‌టి చీఫ్ కమిషనర్ గిరిజా శంకర్‌కు కడప ఆర్ అండ్ బి అతిథి గృహంలో కలిసి ఘనంగా సన్మానించి వినతిపత్రం అందజేశారు. జిల్లా, రాష్ట్రంలోని అన్ని రకాల వ్యాపార వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పి. షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ ఎపి జిఎస్‌టి, వ్యాట్ చట్టంలోని సిఫార్మ్, ఎఫ్ ఫార్మ్ కి సంబంధించి అసెస్మెంట్ ఆర్డర్స్ డిపార్ట్మెంట్ వారు ఫైనలైజ్ చేసిన తరువాత జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోని వేలకోట్ల రూపాయలు పెండింగ్‌ల్లో ఉన్నాయని పేర్కొన్నారు. వీటికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ఒటిఎస్ సిస్టమ్ ద్వారా వ్యాపార వర్గాలకు చాలా వరకు డిమాండ్స్ తగ్గించి వారి వ్యాపార అభివృద్ధికి తోడ్పడిందని తెలిపారు. మన రాష్ట్రంలోనూ ఈ విధానాన్ని అమలు పరిచినట్లయితే వ్యాపారులు బాగుపడతారని చెప్పారు. ఇటు వ్యాపార వర్గాలకు అటు ప్రభుత్వానికి లబ్ధి చేకూర్చే అంశాలు చాలా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో జిఎస్‌టి సమస్యలు పరిష్కరించకపోతే తిరిగి ఢిల్లీ వెళ్లి జిఎస్‌టి కౌన్సిల్ దృష్టికి వ్యాపారుల సమస్యలకు సంబంధించి వినతి పత్రం అందజేసి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కమిషనర్ స్పందిస్తూ తప్పకుండా వ్యాపా రస్తుల, ఆడిటర్స్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా ప్రయత్ని స్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.వరదరాజులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎం.ఆంజనేయులు, కోడూరు సుబ్బయ్య, శ్రీనివాసులు, జై కృష్ణ, శివ, మన్సూర్ అలీ ఖాన్, తౌహీద్ ఖాన్ పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి పౌరస్మృతి అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం

కడప అర్బన్ : ఉమ్మడి పౌరస్మృతి అంశంపై ఈనెల 23న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, సభ్యులు చంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సిపిఎం నగర కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు సిపిఎం నగర కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సంస్థల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

లాభాల బాటలో వ్యవసాయ రంగం

ప్రజాశక్తి - కడప అర్బన్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జెసి గణేష్‌కుమార్

వ్యవసాయ, అనుబంధ రంగాలను మరింత లాభాల బాటలో నడిపించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలని జెసి జి. గణేష్ కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన హాలులో రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి. శివ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విస్తృతమైన సేవలు అందివ్వాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సహకాల కారణంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగుబడి విస్తీర్ణ లక్ష్యాన్ని అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తోందన్నారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ మాట్లాడుతూ రైతుల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన కొన సాగుతోందన్నారు. ఈ సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి అధికంగా సోకే ప్రమాదముందని ముందస్తుగా నివారణా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖల శాఖలు సాధించిన ప్రగతిని, ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాల అమలను, ఆర్బికేల సేవలను సమావేశంలో వివరించారు. అనంతరం సెరికల్చర్ శాఖ వారు రూపొందించిన పట్టు పరిశ్రమ నిర్వహణలో యాజమాన్యం పద్ధతులు, అవగాహన అంశాలతో కూడిన కరపత్రాలను జెసి బోర్డు సభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, ఎపిఎంఐపి పీడి రవీంద్రరెడ్డి, సీఎంఎస్ఎఫ్ డిపిఎం రామకృష్ణ, ఆత్మ పీడి విజయ కుమారి, డీసీఒ సుభాషిణి, ఎల్డిఎం దుర్గా ప్రసాద్, మైనర్ ఇరిగేషన్ అధికారులు, పట్టు పరిశ్రమ శాఖ ఎడి శ్రీనివాసుల రెడ్డి, ఉద్యానశాఖ, మత్స్యశాఖ, సహకార, సివిల్ సప్లై, వ్యవసాయ సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసిపిని ఓడించేందుకు

పెట్రోల్, డీజిల్ ధరలు చాలు : పిసిసి

ప్రజాశక్తి - కడప

రాబోవు ఎన్నికల్లో వైసిపిని చిత్తుచిత్తుగా ఓడించేందుకు ఒక్క పెట్రోలు, డీజిల్ ధరలు చాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం కడపలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక, తమిళనాడు తదితర పొరుగు రాష్ట్రాల కంటే ఎపిలోనే పెట్రోల్, డీజిల్ ధరలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. అధికారంలోకి వస్తే పొరుగు రాష్ట్రాల కంటే తక్కువ ధరకే లభించేటట్లు చేస్తానని గత ఎన్నికలకు ముందు జగన్ అనేకసార్లు చెప్పారని గుర్తు చేశారు. కానీ అధికారంలోకి వచ్చాక జగన్ మాట తప్పి మడమ తిప్పాడని వాపోయారు. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్‌లోక్ సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం ప్రకారం దేశంలోని 28 రాష్ట్రాలు ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాలలో ఎక్కువ ధరల విషయంలో ఆంధ్రప్రదేశ్ పెట్రోల్ విషయంలో మొదటి స్థానం, డీజిల్ విషయంలో రెండవ స్థానంలో ఉండటం శోచనీయమన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో పెట్రోలు, డీజిల్ బంకులు వ్యాపారం జరక్క మూతపడ్డాయన్నారు. రైతులు వ్యవసాయానికి ట్రాక్టర్లు వాడాలంటే భయపడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం, ఇసుక, సిమెంటు, నూనె, పప్పు దినుసులు కూరగాయలు, ప్రత్యేకించి టమోటా ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున కర్గే 81వ జన్మదినం సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి, రాష్ట్ర నాయకులు నజీర్ అహ్మద్, సత్తార్, ప్రసాద్ గౌడ్, వెంకటరమణారెడ్డి, ఆరిపుల్ల, చార్లెస్, కె. శ్రీనివాసులు, జిల్లా నాయకులు పుల్లయ్య, లావణ్య, పాలగిరి శివ, బాబు, ఆనంద్, గౌరీ మొహిద్దిన్, జిలాన్ పాల్గొన్నారు.

రెండో రోజుకు రిలే నిరాహార దీక్షలు

కడప అర్బన్ : సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు కార్పొరేషన్ ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు శుక్రవారం నాటికి రెండవ రోజు చేరుకున్నాయి. దీక్షలను ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కోశాధికారి గోపి, కమిటీ సభ్యులు ప్రకాష్ ప్రారంభించారు. అనంతరం దీక్ష శిబిరాన్ని ఉద్దేశించి గోపి, సుంకర కిరణ్ కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని పేర్కొన్నారు. కోవిడ్ -19 సిబ్బంది కి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కరోనా కాలంలో వారు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ప్రజలకు సేవ చేశారని తెలిపారు. ఈ నెల 27న రాష్ట్రంలోని అన్ని మున్సిపల్, కార్పొరేషన్ కార్యాల యాల ముట్టడిని నిర్వహిస్తామని చెప్పారు. దీక్షా శిబిరాన్ని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపి తమ మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సుంకర రవి , కంచూ పాటి తిరుపాల్, ఇత్తడి ప్రకాష్, వడ్లపల్లి శ్రీధర్ బాబు, మణి, కిరణ్ కుమార్ , నాగరాజు, సాయి, కార్మికులు, మహిళలు, డ్రైవర్లు, లోడర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నేడు ఎల్ఐసి శిక్షణా తరగతులు

కడప అర్బన్ : ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, కడప డివిజన్ ఆధ్వర్యంలో యూనియన్ శిక్షణా తరగతులు కడపలో శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం డివిజన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథ రెడ్డి, మహిళా కన్వీనర్ అమీనా పర్వీన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తరగతులకు కడప జిల్లా బీమా సిబ్బంది హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. బీమారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను, ఎల్ఐసి సాధిస్తున్న విజయాలను, భవిష్యత్ లక్ష్యాలను, కర్తవ్యాలను ఈ శిక్షణ తరగతుల్లో వివరిస్తామని తెలిపారు. ముఖ్య అతిథులుగా సంఘం అఖిల భారత ఉపాధ్యక్షులు పి.సతీష్, జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య హాజరవుతున్నట్లు తెలిపారు.

నూతన భవనాలు ప్రారంభం

పోరుమామిళ్ల టౌన్ : మండలంలోని పలు నూతన భవనాలను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ప్రభుత్వ సలహాదారు పి. నాగార్జునరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అక్కల రెడ్డి పల్లె సచివాలయ పరిధిలో వైఎస్ఆర్‌హెల్త్ క్లినిక్‌ను, కవలకుంట్ల సచివాలయ పరిధిలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, జగనన్న సురక్ష ద్వారా అనేక రకాల సేవ కార్యక్రమాలను గ్రామీణులకు అందుబాటులో వచ్చేలాగా చేశారని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్త విజయ ప్రతాపరెడ్డి, జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు సిబాష, సి రాజశేఖర్, ఎంపిటిసిలు, తహశీల్దార్ గంగయ్య, ఎంపీడీవో చంద్రమౌళి, స్పెషల్ ఆఫీసర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గెజిటెడ్ స్టేటస్ కల్పించాలి

కడప అర్బన్ : వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ పోస్టుకు గజిటెడ్ స్టేటస్ కల్పించాలని జిల్లా చైర్మన్ నంద్యాల రాజశేఖర్ కోరారు. శుక్రవారం ఉద్యోగుల స్పందనలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటరినేరియన్స్ ఫెడరేషన్ జిల్లా తరపున కేడర్లకు ఉన్న సమస్యలను తెలియజేశామన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ చాంద్‌బాషా, విద్యాసాగర్, సాల్మన్ రాజ్, జయపాల్, హిమబిందు, బాబు నాయక్, షాహిదా బేగం, పశుసంవర్ధక సహాయకుల సంఘం వీరకుమార్, సునీల్, రామసుబ్బారెడ్డి, సుధీర్ కుమార్, జనార్ధన్, రెడ్డయ్య పాల్గొన్నారు.

చేనేత కుటుంబాల్లో వెలుగులు : జెసి

కడప : 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం' ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేనేత కుటుంబాల్లో వెలుగులు నింపడం గర్వించదగ్గ విషయమని జెసి జి.గణేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి జిల్లా వెంకటగిరి బహిరంగ సభ నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం' ఐదవ విడత లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ విసి హాలు నుండి జెసితోపాటు రాష్ట్ర ఉద్యాన సలహాదారులు పి. శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్సు ముగిసిన అనంతరం స్థానిక విసి హాలులో పథకం ద్వారా జిల్లాలోని 9,446 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.20,67,04,000ల మెగా చెక్కును అతిథులతో కలిసి జెసి లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం ఐదో విడత 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం' పథకం ద్వారా జిల్లాలో 9,449 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.24 వేలు చొప్పున రూ.22.67 కోట్లు అందడం ఆనందదాయకమైన విషయం అన్నారు. ఏవైనా కొన్ని కారణాల వల్ల ప్రస్తుతం లబ్ధిపొందలేక పోయిన వారు స్థానిక సచివాల యాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత ఉండీ లబ్ధి చేకూరడంలో ఏమైనా సమస్యలుంటే సంబంధిత శాఖ జిల్లా అధికారులను, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబరు : 1902 కు కాల్ చేసి తెలుపవచ్చన్నారు.

కొపర్తి పంచాయతీ సర్పంచ్ చెక్ పవర్ రద్దు

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని కొప్పర్తి సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేసినట్లు మండల ఎంపీడీవో రవి కుమార్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు, కొప్పటి సర్పంచ్ కె సుజాతమ్మ గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని ఉప సర్పంచ్ కె లక్ష్మీనారాయణ రెడ్డి సహా తొమ్మిది మంది వార్డు సభ్యులు జిల్లా పంచాయతీ ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారన్నారు. స్పందించి డిపిఒ సర్పంచ్‌కు నోటీసులు జారీ చేయగా, ఆమె ఇచ్చిన సంజాయితీ సంతృప్తికరంగా లేకపోవడంతో చెక్ పవర్ రద్దు చేసినట్లు వారు పేర్కొన్నారు. పరిపాలన సౌలభ్యం కిందట ఉపసర్పంచ్ అయిన కె. లక్ష్మీనారాయణ రెడ్డికి ఉత్తర్వులు వెలువడే వరకు చెక్ పవర్ అప్పగించినట్లు తెలిపారు.

సిఎం ఇచ్చిన హామీని అమలు చేయాలి

కడప అర్బన్ : సిఎం ఇచ్చిన హామీని అమలు చేయాలని విఆర్ఎ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్ కోరారు. శుక్రవారం డిప్యూటీ తహశీల్దార్ రోనాల్డ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017, మార్చి 24న అప్పటి ప్రతిపక్ష నేత ప్రస్తుత ముఖ్యమంత్రి అధికారంలోకి వచ్చిన వెంటనే విఆర్ఎలకు రూ.15వేలు జీతం పెంచుతామని మాట ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తక్షణమే వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరాల తరబడి తాతల ముత్తాతల నుంచి విఆర్ఎల్‌గా పనిచేస్తున్న జీతం పెరగకపోవడం అన్యాయమని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు డిమాండ్ చేశారు. అర్హులైన వారందరికీ వాచ్ మెన్, అటెండర్, డ్రైవరు, వీఆర్వోలుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు. కట్టిన డబ్బులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యోగి, మస్తాను, రాజు, భూషణం, గురువయ్య, ఉదయ్ రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

కడప అర్బన్ : 1 నుంచి 10 వ తరగతి వరకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను కడప మండల పరిధిలోని పాఠశాలలకు పంపిణీ చేశామని కడప మండల విద్యాశాఖ అధికారులు పాలెం నారాయణ, ఇర్షాద్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న విద్యా కానుక-4 లో భాగంగా సెమిస్టర్-1, సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను పాఠశాలలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే పాఠశాలలకు అన్ని పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశామని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరం ఎవరైనా నూతనంగా విద్యార్థులు చేరినట్లయితే వారికి త్వరలోనే పాఠ్యపుస్తకాలు ఇస్తామని చెప్పారు.

విత్తన శుద్ధిపై అవగాహన

పెండ్లి మర్రి : మండలంలోని వెల్లటూరులో రైతులకు కంది విత్తనాలు, విత్తన శుద్ధి పై కెవికె ఊటుకూరు శాస్త్రవేత్తలు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కంది పంటలో పాటించాల్సిన వివిధ యాజమాన్య పద్ధతులను శాస్త్రవేత్త కె. సాయి మహేశ్వరి వివరించారు. ఎకరానికి సరిపడా ఎల్ఆర్‌జి - 105 రకం కంది విత్తనాలను, ట్రైకోడెర్మా విత్తన శుద్ధి మందును రైతులకు అందజేస్తూ వాటి వాడకంపై తెలియజేశారు. డాక్టర్ ప్రత్యూష శాస్త్రవేత్త ఏరువాక కందిలో మేలైన రకాలు సమగ్ర ఎరువుల యాజమాన్యం, పప్పు జాతి పంటల ఆవశ్యకత గురించి తెలియజేశారు.

నేడు ప్రత్యేక లోక్ అదాలత్

కడప : జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 10:30 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక లోక్ అదాలత్ ను నిర్వహిస్తారని, ప్రజలు ప్రజలు వినియోగించుకొని సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, పి. అన్నపూర్ణ, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్, ఎం. ప్రదీప్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక లోకాదాలతో మోటార్ వాహనాల ప్రమాదాలు, భూ సేకర ణకు సంబంధించిన కేసులను మాత్రమే రాజీ చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 08562 - 258622, 244622 నంబర్లకు ఫోన్ ద్వారా కానీ districts. ecourts.gov.in/Kadapa, dlsakdp@gmail.com ఈమెయిల్ అడ్రస్ ద్వారా గాని సంప్రదించాలన్నారు.

భూపేష్‌రెడ్డితో అలమూరు జగన్మోహన్‌రెడ్డి కుటుంబం

నేటి యువతకు ఆదర్శం భూపేష్‌రెడ్డి
- యువ నాయకులు అలమూరు జగన్మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - కొండాపురం

మాట్లాడుతున్న జగన్మోహన్‌రెడ్డి

తాత, తండ్రుల రాజకీయ వారసత్వంతో దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతున్న యువనాయకులు చదిపిరాల భూపేష్‌రెడ్డి నేటి యువతకు ఆదర్శమని తిమ్మాపురం తెలుగు దేశం పార్టీ యువ నాయకుడు అలమూరు జగన్మోహన్‌రెడ్డి కొనియాడారు. శుక్రవారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్‌ఛార్జి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికీ వెళుతూ, గ్రామంలోని ప్రతి తలుపు తడుతూ, ప్రతి మనిషిని పలకరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుంటూ, తక్కువ సమయంలోనే పరిచయం చెందిన యువ నాయకుడుగా భూపేష్‌రెడ్డి నియోజకవర్గంలో మంచి పేరు సంపాదించుకున్నారని చెప్పారు. కడప జిల్లాలో పేరు గాంచిన దేవగుడి గ్రామానికి చెందిన ఆనాటి రాజకీయాల్లో కమ్యూనిస్టు నాయకులు చదిపిరాల సుబ్బ రామిరెడ్డి, ఆయన కుమారుడు నేటి నాయకుడు చదిపిరాల నారాయణరెడ్డి అలియాస్ దేవగుడి నారాయణరెడ్డి కుటుంబం నుంచి వచ్చిన భూపేష్ రెడ్డి రాజకీయ నేపధ్యాన్ని ప్రారంభించిన నాటి నుంచి యువకులతో మమేకమై, యువకులలో మంచి జోష్ నింపుతూ ముందుకెళ్తున్నారని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలే లక్ష్యంగా, వ్యక్తిగత దూషణలకు దూరంగా ఆయన వేస్తున్న అడుగులను చూసి పెద్ద పెద్ద సీనియర్ నాయకులే ఆశ్చర్యానికి లోనవుతున్నారు. మండలంలోని ప్రతి సమస్య పైన స్పష్టమైన అవగాహనతో పోరాటం చేస్తూ ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఆయన పోరాట పటిమ చూసి ఇప్పటికే నియోజకవర్గంలోని ప్రజలు ఆయన నాయకత్వంపై విశ్వాసం పెంచుకున్నారని తెలిపారు. భూపేష్‌రెడ్డి నేటి యువతకు ఆదర్శ ప్రాయుడని జగన్మోహన్‌రెడ్డి కొనియాడారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ఎమ్మెల్యే బాగా అభివృద్ధి చెందారు : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి గడిచిన నాలుగేళ్ల కాలంలో రూ.1000 కోట్ల ఆస్తిని సంపాదించి బాగా అభివృద్ధి చెందారని ప్రొద్దుటూరు అభివృద్ధి మాత్రం గాలికి వదిలేశారని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి విమర్శించారు. శుక్రవారం స్థానిక నెహ్రు రోడ్డులోని తన కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో తాము చేసిన అభివృద్ధి పనులకు తుది మెరుగులు దిద్ది ఆ అభివృద్ధి పనులు తానే చేసినట్లు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని వాపోయారు. రూ. లక్షల కోట్ల అప్పులు చేయడం తప్ప అభివృద్ధి అనేది సిఎం జగన్ గాలికి వదిలేశారనిఆరోపించారు. మళ్లీ ఇదే ప్రభుత్వమే అధికారంలోకి వస్తే ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రజలు తమ ఆస్తులను ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వరదరాజులురెడ్డి ఎద్దేవ చేశారు. ఇసుక, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యక్రమాలకు ప్రొద్దుటూరు పట్టణానికి కేంద్ర బిందువుగా చేశారని తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ టిడిపి పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, శంకర్ నారాయణ, వద్ది బాలుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలు పంపిణీ

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : దొరసానిపల్లెలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులకు వివేకానంద ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా కెరీర్ గైడెన్స్ పుస్తకాలను పంపిణీ చేశారు. శుక్రవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి పదోతరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకోవాలన్నారు. లక్ష్య సాధనకు కెరీర్ గైడెన్స్ పుస్తకం ఎంతో దోహద పడుతుందన్నారు. విద్యార్థి దశలోనే ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని, కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. స్ఫూర్తిదాయకమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొండారెడ్డి, సంస్థ ప్రతినిధి టి. వెంకట సురేష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గంజాయి కేసులో మరో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ముద్దనూరు

ఈనెల 16న నమోదైన గంజాయి కేసులో మరో నిందితున్ని అరెస్టు చేసినట్లు సిఐ నరేష్ బాబు తెలిపారు. సిఐ వివరాలు ప్రకారం ముద్దనూరు – కడప ప్రధాన రహదారిలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో ఉన్న రాజస్థాన్ డాబా నిర్వహకులు అక్కడే గంజాయి విక్రయిస్తున్న కేసులో పరారీలో ఉన్న రెండో నిందితున్ని అరెస్టు చేసినట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం రాజస్థాన్ డాబా వద్ద నిందితున్ని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు సిఐ చెప్పారు.

ఉరేసుకొని యువకుడి మృతి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మృతిచెందిన నరేంద్ర

పట్టణంలో మెయిన్ రోడ్డు వద్దనున్న ఒక ఇంటిలో పోలిమెల్ల నరేంద్ర(20) అనే యువకుడు శుక్రవారం ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి కథనం మేరకు... పట్టణానికి చెందిన నాగరాజు కూరగాయల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు. వారిలో నరేంద్ర ఇంటర్ పూర్తి చేసి ఓపెన్ కేటగిరిలో డిగ్రీ చదువుతున్నాడు. శుక్రవారం తండ్రి కూరగాయల వ్యాపారం ముగించుకుని ఇంటికొచ్చారు. ఆ సమయంలో అతని కుమారుడు ఏడుస్తూ బాధపడడం గమనించి ఏమైందని అడగ్గా ఎలాంటి సమాధానం చెప్పలేదు. తరువాత తండ్రి భోజనం తీసుకొచ్చేందుకు బయటకు వెళ్లి తిరిగి వచ్చే సరికి తలుపులు బిగించి ఉంది. ఎంత పిలిచినా పలకపోవడంతో వెనుకవైపు నుంచి వెళ్లి చూడగా నరేంద్ర ఫ్యాన్‌కు ఊరేసుకుని మృతిచెందాడు. ఇదీలా ఉండగా ఇటీవల ఒక యాప్ ద్వారా ఓ అమ్మాయితో మాట్లాడుతూ ఉండడం తాను గమనించానని, ఆ అమ్మాయి ప్రేమ నిరాకరించడంతోనే కుమారుడు చెందాడని తండ్రి నాగరాజు అనుమానం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొండాపురం

ప్రజా సంక్షేమమే జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని, సంక్షేమ ఫలాలు అందరికీ అందాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి 2019లో ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా ప్రకటించిన నవరత్నాలు అమలు చేస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. ప్రజలు ప్రభుత్వానికి కట్టిన పన్నులను తిరిగి వారికే చేరవేస్తున్నారని చెప్పారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఏడాదికి రూ. రెండు లక్షల చొప్పున వసూలు చేసిన పన్నులు ఎక్కడా ఖర్చు పెట్టకుండా పాలకులే దోచేశారని విమర్శించారు. వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ఆరోగ్యశ్రీని అమలు చేస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు అన్ని రకాల సంక్షేమ ఫలాలు వాలంటీర్ల ద్వారా అందజేస్తున్నామని చెప్పారు. ఎంపిడిఒ నాగ ప్రసాద్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను జగనన్న సురక్ష పథకం ద్వారా అందజేస్తున్నామని పేర్కొన్నారు. కొండాపురం పంచాయతీ పరిధిలో833మందికి రేగడిపల్లి సచివాలయం పరిధిలో 400 మందికి అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు సి.లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు శైలె చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ నాగ్రప్రసాద్, మండల విద్యాశాఖ అధికారులు ఓబులేసు, రామయ్య, డిప్యూటీ తహశీల్దార్ మీనా, జడ్‌పిటిసి భారతి, మండల నాయకులు చింతా రాజారెడ్డి, నరసింహారెడ్డి, డాక్టర్ నవకోటిరెడ్డి, కె. పెద్దిరెడ్డి, దాదు రామకృష్ణ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, లక్ష్మికాంత్ రెడ్డి, అశోక్ రెడ్డి, కొండ నాగార్జున రెడ్డి, కొండ నరసింహారెడ్డి, బుజ్జి.వి.రామాంజినే రెడ్డి, మైనారిటీ నాయకుడు నస్ర్, అల్లం సత్యవై.శేఖర్, దామోదర్ రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు. సిఐ సుదర్శన్ ప్రసాద్, ఎస్ఐ యోగేంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. **వేంపల్లె :** జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం చేయడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, ఎంపిపి లక్ష్మి గాయత్రి, ప్రిన్సిపల్ మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక 7వ గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లను అందజేశారు. ఎంపిపి, సర్పంచ్, మండల కన్వీనర్లు కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు భారతి, కటిక చంద్రశేఖర్, రాజశేఖర్, వార్డు సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, భూగర్భ గనుల శాఖ డైరెక్టర్ సల్మా , వైసిపి యూత్ అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్, సచివాలయ కన్వీనర్ ముత్యాల రమేష్ బాబు, అయ్యవారిపల్లి సర్పంచ్ రామగంగిరెడ్డి, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, గ్రామ సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. **చాపాడు :** జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉపయోగం అని ఎంపిపి టి లక్ష్మయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని సోమాపురంలో జగనన్న సురక్ష గ్రామసభను నిర్వహించారు. పంచాయతీ పరిధిలో 634 మందికి వివిధ రకాల ధృవీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేష్‌రెడ్డి, తహశీల్దార్ సుభాని, సచివాలయాల కన్వీనర్ల మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, ఎఒ రామాంజనేయులు, సర్పంచ్ శ్రీనువాసుల రెడ్డి, మాజీ సర్పంచులు రామాంజనేయులరెడ్డి, హాజరత్‌రెడ్డి, అంగన్వాడీ సూపర్‌వైజర్ సుబ్బరత్నమ్మ, ఉపాధి ఎపిఒ పద్మారాణి, పంచాయతీ కార్యదర్శి పద్మావతి పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** ప్రజల ప్రతి సమస్యకూ పరిష్కారాన్ని చూపేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సురక్ష పథకాన్ని ఏర్పాటు చేశారని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్బిఐ వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 1180 వివిధ కుల, ఆదాయ, వివాహ, ఇతర 11 రకాల ధృవీకరణ పత్రాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్ , లక్ష్మి భార్గవి, రమాంజనమ్మ, కోడి రమణ , రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప, దూదేకుల సంఘ అధ్యక్షులు ఓ.రసూల్, జగనన్న కన్వీనర్లు, గృహ సారథుల ఇంచార్జి చంద్ర మౌళి, డిప్యూటీ తహశీల్దార్ సుజిత్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి ధృవీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

'మణిపూర్' ఘటనపై మోడీ మౌనం తగదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్/జమ్మలమడుగు

మణిపూర్‌లో మహిళల పట్ల అసాంఘిక శక్తులు చేసిన దుశ్చర్య సంఘటన యావత్ సభ్య సమాజం సిగ్గు పడే సంఘటపై ప్రధాని నరేంద్ర మోడీ మౌనం వహించడం తగదని, కనీసం మంత్రులు కూడా స్పందించకపోవడం అత్యంత దారుణమని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి తులసీశ్వర్ యాదవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినయ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహించిన వేర్వేరు సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకూ మహిళలకు రక్షణ కరువైందన్నారు. నిత్యం ఎక్కడో ఒక చోట మహిళలపై దాడులు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. నెల రోజులుగా మణిపూర్‌లో అల్లర్లు, ఇతర ఘటనలు విపరీతంగా చోటు చేసుకుంటున్నాయని, వాటిని అది మరవక ముందే ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి అఘాయిత్యానికి పాల్పడిన సంఘటనతో యావత్ సభ్య సమాజం సిగ్గుపడాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రోమ్ నగరం తగలబడుతుంటే నిరో చక్రవర్తి ఫిడేలు వాయించిన చందంగా మణిపూర్ తగలబడి పోతుంటే మోడీ మౌన నిద్రలో వుండటం దారుణం అన్నారు. ఎక్కడో కేరళలో ఏనుగు సంఘటనపై గగ్గోలు పెట్టినా కేంద్ర మంత్రులు మణిపూర్‌లో మహిళల పట్ల జరిగిన అమానుషంపై ఎందుకు నోరు మెదపరని ప్రశ్నించారు. మహిళల పట్ల దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రమేష్, సుదర్శన్, సురేంద్ర, విష్ణు, మోహన్ పాల్గొన్నారు.

రెండవ రోజుకు విఆర్‌ఎల దీక్షలు

పులివెందుల రూరల్ : ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు నిర్వహిస్తున్న దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తుగుట్ల మధు సూదన్‌రెడ్డి మద్దతుగా కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏల ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం తీర్చాలని పేర్కొన్నారు. కనీస వేతనం కచ్చితంగా అమలు చేయాలని, నామినీలుగా పనిచేస్తున్న వారందరినీ విఆర్‌ఎలుగా నియమించాలని చెప్పారు. అర్హులైన ప్రస్తుత విఆర్‌ఎలను విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నత కల్పించాలని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పినటువంటి హామీలను అన్నింటిని నెరవేర్చాలని కోరారు. లేనిపక్షంలో దీక్షలను మరింత ఉధృతం చేస్తూ ముందుకు సాగుతామని హెచ్చరించారు.

జన్మభూమి కమిటీలతో దోపిడీ

జమ్మలమడుగు : టిడిపి పాలనలో జన్మభూమి కమిటీలతో ప్రజల్ని దోచుకున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో కుల, మత వర్గాలకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాన్ని అందిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు పట్టణంలోని 19,20 వార్డు సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం జన్మభూమి కమిటీలను పెట్టి అబాసపాలైందన్నారు. డబ్బులు తీసుకుని ప్రభుత్వ పథకాలను అర్హులుగా ఎంపిక చేసేవారని ఆరోపించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. సాంకేతిక కారణాలతో ప్రభుత్వ పథకాలు అందకపోతే వాటిని ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సరిదిద్దుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వేల్పుల శివమ్మ, వైస్ చైర్మన్ పోరెడ్డి రామలక్ష్మమ్మ, మంగదొడ్డి సింగరయ్య, కౌన్సిలర్ షామీర్, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ డి.ఈ.బాలమల్లేశ్వర్, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మొహరంను సంతోషంగా జరుపుకోవాలి

వేంపల్లె : హిందూ- ముస్లిం సోదరులు అందరూ కలిసి మొహరం పండుగను సంతోషంగా జరుపుకోవాలని సిఐ వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో మైత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొని రావాలని చెప్పారు. మొహరం పండుగ సమయంలో ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా అందరూ కలిసి కట్టుగా ఉండాలని సూచించారు. మత ఘర్షణలకు పాల్పడకుండా చూసే బాధ్యత మత పెద్దలపై ఉందన్నారు. అందరూ కలిసి కట్టుగా ఉన్నప్పుడే గ్రామంలో సమస్యలుండవని చెప్పారు. శాంతి భద్రతలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమావేశంలో మత పెద్దలు సాదక్‌వలి, మాజీ జడ్‌పిటిసి డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, ఎంపిటిసి రహంతుల్లా ఖాన్, పాత హాలు హకీం, ఆర్యవైశ్య అధ్యక్షులు సురేంద్ర, వార్డు సభ్యులు ముత్యాల ఆంజనేయులతో పాటు అయా వర్గాల మత పెద్దలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కొంత కాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కార్మిక సంఘ (సిఐటియు అనుబంధం) గౌరవాధ్యక్షులు సత్యనారాయణ అన్నారు. సంఘ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు దీక్ష చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న కొబ్బరినూనె సబ్బులు, యూనిఫాం,చెప్పులు ఇవ్వాలన్నారు. హెల్త్ అలవెన్స్ మంజూరు చేయాలన్నారు. అధికారుల వేధింపులు మానుకోవాలన్నారు. వర్షాలు పడుతున్నందున రెయిన్ కోట్లు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంటి, సాల్మన్, రాష్ట్ర కమిటీ సభ్యులు విజయకుమార్, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, సాయి, రవికుమార్, రవణమ్మ, ప్రమీలమ్మ, గుర్రమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

రేపు 'జింకా'పై సాహిత్య సదస్సు

ప్రొద్దుటూరు: సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ నెల 23న ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ రచయిత జింకా సుబ్రహ్మణ్యంపై సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు వైవీయూ సభ్య కార్యదర్శి కుల సచివులు ఆచార్య వై.వి.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 'నెల నెల సీమ సాహిత్యం'లో భాగంగా 'జింకా సుబ్రహ్మణ్యం జీవితం–సాహిత్యం అనే అంశంపై ప్రొద్దుటూరుకు చెందిన ఉపాధ్యాయులు కొత్తపల్లి శీను ప్రసంగించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన ఆహార ఉత్పత్తులు

ప్రజాశక్తి- పులివెందుల టౌన్

మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన వ్యవసాయ ఉత్ప త్తులను అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ విజయ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని పశు అంతర్జాతీయ పరిశోధన కేంద్రంలో ఏర్పాటు చేసిన రైతు శాస్త్రవేత్తల నైపుణ్య కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 8 లక్షల మంది రైతులతో విస్తృస్థాయిలో ప్రకృతి వ్యవసా యాన్ని అమలు పరచాలనే ఉద్దేశంతో రాష్ట్రం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ప్రతి గ్రామానికీ ఒక రైతు శాస్త్రవే త్తను నియమించనున్నారని తెలిపారు. శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో సిఇఒ రామారావు, సీనియర్ కన్సల్టెంట్ రాముడు, వ్యవసాయ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.

సైకాలజిస్టు ఉపాధ్యాయులను నియమించాలి

కడప అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రతి విద్యాసంస్థల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం తరగతుల నిర్వహణకు సైకాలాజిస్టు ఉపాధ్యాయులను నియమించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెస్సివ్ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని యూనియన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు ప్రారంభమై రెండు నెలలు కూడా పూర్తి కాలేదని చెప్పారు. ఇంతలోనే కడప తోపాటు అనేక జిల్లాలలో విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమైన తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. పిఎస్‌యు నాయకులు గోపి, నాగేంద్ర, నరసింహ, కేశవ, చరణ్, అఖిల్ పాల్గొన్నారు.

నగరంలో అభివృద్ధి నిల్ : కాంగ్రెస్

కడప : కడప నగరంలోని 15, 16, 17 డివిజన్ల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ ఎన్. తులసి రెడ్డి, విష్ణు ప్రీతం రెడ్డి అన్నారు. శుక్రవారం పై డివిజన్లలో పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలు అసలు ఏం జరగడం లేదని మండి పడ్డారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని వాపోయారు. అభివృద్ధి వూసే లేదు, డివిజన్లను సందర్శించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వాపోయారు. అధికార పార్టీ నాయకుల అక్రమ కట్టడాలు, భూకబ్జాలు ఈ డివిజన్లోనే ఎక్కువగా జరుగుతున్నా అధి కారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కొంతమంది అక్ర మార్కులు కాలువలు రోడ్లు లేకుండా పూడ్చి వేస్తున్నప్పటికీ అధికా రులు నిమ్మకు నీరు ఎత్తినట్లు చూసి చూడనట్లు వదిలేస్తున్నారన్నారు. అనంతరం నగర డిప్యూటీ కమిషనర్‌ను కలిసి స్థానిక సమస్యలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో 16వ వార్డు ఇన్‌ఛార్జి పుల్లయ్య, డీసీసీ మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శులు సత్తార్, చార్లెస్, లావణ్య, శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి తిరుమలేశు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు బాబు, నగర అధ్యక్షులు హరి, ఫరూక్, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు శివ, పాల్గొన్నారు.

డివిజన్ పర్యటనలో నాయకులు

వినియోగదారులతో మాట్లాడుతున్న సిబ్బంది

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం
- శ్రీ సాయి హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని శ్రీసాయి హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఇతర ఏజెన్సీల నుంచి తమ గ్యాస్ ఏజెన్సీకి బదిలీ అయిన వినియోగదారులకు కొందరు భయబ్రాంతులకు గురిచేస్తున్నారని, వాటిని నమ్మొద్దని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ కంపెనీ నిబంధనల మేరకే శ్రీ సాయి హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీలోకి బదిలీ చేశామని చెప్పారు. ఇందుకు సంబంధించి పలువురు వినియోగదారులను భయబ్రాంతులకు గురిచేసే విధంగా రేషన్ కార్డు రద్దు అవుతుందని, కనెక్షన్లు కూడా కోల్పోవడం జరుగుతుందని, సేవలు అంతంత మాత్రమే ఉంటాయని, వినియోగదారులకు భారం అయ్యే విధంగా అధిక చార్జీలు వసూలు చేస్తారంటూ, పలు రకాల వదంతులు సృష్టిస్తున్నారని, వాటిలో ఏమాత్రమూ వాస్తవాలు లేవని చెప్పారు. తమ అభివృద్ధి చూసి ఓర్వలేని వారు కొందరు ఇలాంటి వదంతులను సృష్టిస్తున్నారని, వారు చెప్పే మాటలను నమ్మరాదని పేర్కొన్నారు. హెచ్‌పి గ్యాస్ యాజమాన్యం నిబంధనలు తుచా తప్పక పాటిస్తూ వినియోగదారుల మన్ననలు పొందేందుకు కృత నిశ్చయంతో పనిచేస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులోనూ వినియోగదారుల సహకారంతో మెరుగైన సేవలను అందిస్తామని చెప్పారు. వినియోగదారులకు ఏవైనా సందేహాలుంటే నారాయణ స్కూల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ సాయి హెచ్‌పి గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం తెలియజేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి- దువ్వూరు

మండలంలోని ఎరువుల దుకాణాలను ఎడిఎ రమణారెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాలలో రికార్డులు మెయింటైన్ లేకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీజన్‌ను బట్టి నకిలీ ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయో ప్రాడెక్టులను అనుమతించిన వాటినే విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఏవోలు పద్మజ, అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు

వైఎస్‌ఆర్ కాపు నేస్తానికి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - చక్రాయపేట

వైఎస్‌ఆర్ కాపు నేస్తం పథకానికి కాపు, బలిజ, తెలగ, ఒంటరి మహిళలందరూ దరఖాస్తులు చేసుకోవాలని కాపునాడు కడప పార్లమెంటరీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సంగా హేమలత పేర్కొన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 45 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు మహిళలందరూ ఈ పథకానికి అర్హులన్నారు. కుటుంబ ఆదాయం రూ.10వేల లోపు ఉండాలని, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షన్ పొందువారు, ఆదాయ పన్ను చెల్లించువారు అనర్హులు అన్నారు. పథకానికి అవసరమైన ఆదాయ, కుల సర్టిఫికెట్లను ఆయా సచివాలయంలో సురక్ష క్యాంపులో పొందవచ్చన్నారు. ఈనెల 22 లోపు పథకానికి దరఖాస్తులు చేసుకోని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కొలువుదీరిన పీర్లు

ప్రజాశక్తి - ముద్దనూరు

మొహరం పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వే గేటు వద్ద ఉన్న పీర్ల చావిడిలో శుక్రవారం పీర్లు కొలువుదీరాయి. ఈనెల 26,27 చిన్న (సరగత్తు) ఊరిలో తిరుగుట, 28న విడిది దినం.29న ఏటికి (మక్కా) వెళ్లడం ఉంటుందని మొహరం కమిటీ నిర్వహకులు తెలిపారు. 28న సాయంత్రం అబ్దుల్ ఖాదర్(ఫేమస్ బ్రదర్స్) ఇంటి వద్ద నుండి స్వాముల వారికి చదివింపులు (పాల సగరబత్, పూల సహారాలు)తో మెయిన్ బజార్ నుంచి పీర్ల చావిడి వరకు ఊరేగింపు ఉంటుందన్నారు. రాత్రికి గుండం కాల్చుట, 29న తెల్లవారు జామున 3 గంటలకు గుండంలో పీర్లు దిగుట, మధ్యాహ్నం (మక్కా) ఏటికి పోవడం వంటి కార్యక్రమాలుంటాయని తెలిపారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకుని ప్రసాదం తీసుకోవాలని మొహరం కమిటీ సభ్యులు తెలిపారు.

ఓటర్ల జాబితా పరిశీలన

ఖాజీపేట : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా పునఃపరిశీలనపై అధికారులు దృష్టి సారించారు. ఓటర్ల జాబితాలో చోటు చేసుకున్న అవకతవకలు, అర్హులను తొలగించడం, అనర్హులను చేర్చడం వంటి వాటిపై ఎన్నికల సంఘం దృష్టి సారించింది. ఈ చర్యల్లో భాగంగా శుక్రవారం మండలం పరిధిలోని రావులపల్లి పంచాయతీ కుమ్మరావులపల్లి, రావులపల్లిలో బూత్ నెంబర్ 209 లో బిఎల్‌ఒతో కలిసి తెలుగుదేశం పార్టీ నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్ దాసరి రవి ప్రసాద్ యాదవ్, టిడిపిమండల యువనాయకులు తుట్టే రాము యాదవ్ ఇంటింటా వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించారు.

సమిష్టి కృషితో పార్టీని బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సమిష్టి కృషితో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసుకుందామని పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పెద్దముడియం మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్లు, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులతో ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా భూపేష్ రెడ్డి మాట్లాడుతూ సమిష్టి కృషితో పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రతి కార్యకర్తా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పోల్ మేనేజ్మెంట్ పార్టీ బలోపేతం అంశాలపై మాట్లాడారు. మీ ప్రాంతాలలో ఫేక్ ఓట్లు నమోదును ఉంటే చనిపోయిన వారి ఓటర్లను గుర్తించి తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శివనాథ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, పెద్దముడియం టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KADAPA.
I.A.No. 556 of 2018 in O.S.No. 360 of 2012

Between:
1. Pottipati Pooja, daughter of Murali Krishna Naidu, Hindu, Aged about 20 years, residing in D.No.2/149-A, Ramnagar, Rajampeta town, Kadapa District.
2. Pottipati Rishitha, daughter of Murali Krishna Naidu, Hindu, aged about 14 years, minor,
No.2 is minor represented by their natural guardian mother Smt.P.Vasundhara, wife of P.Murali Krishna Naidu, Hindu, House wife, aged about 35 years, residing in D.No.2/149-A, Ramnagar, Rajampeta town, Kadapa District.

...Petitioner/Plaintiffs

Vs

7. Smt.P.Anitha, Wife of Late P.Madhusudhana Naidu, Hindu, aged about 35 years, residing in D.No.2/1089, Nagarajupeta, Kadapa City.
8. P.Vishu Sai, Son of Late P.Madhusudhana Naidu, Hindu, aged about 20 years, residing in D.No.2/1089, Nagarajupeta, Kadapa City.
9. P.Seshank Chowdari, Son of Late P.Madhusudhana Naidu, Hindu, minor, aged about 11 years, represented by natural guardian mother Smt.P.Anitha, Wife of Late P.Madhusudhana Naidu, Hindu, aged about 35 years, residing in D.No.2/1089, Nagarajupeta, Kadapa City.

...Respondents/Defendants No 7 to 9.

ప్రతివాదులకి రెస్పాండెంట్ నెం.7 నుండి 9లకు నోటీసు

ఇందుమూలంగా తెలియజేయడమేమనగా ప్రతివాదుల రెస్పాండెంట్స్ నెంబరు 7 నుండి 9లకు హాజరు నిమిత్తము తేదీ.14/8/2023 ఉదయం 10.30 గంటలకు పై కోర్టు నందు వాయిదా కలదు. మీ హాజరు కొరకు వాయిదా వున్నది. కావున స్వయంగా కాని, వకీలు ద్వారా కాని హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలయును. లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

యం.సురేష్ కుమార్
అడ్వకేటు
కడప. సెల్: 9440673990.